నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 కరీంనగర్, శనివారం 25 మే 2024 PEDDAPALLI



రేకుర్తిలోని ఎస్సారెస్పీ కాలువ

# ఎస్సారెస్పీ కాలువలో బల్దియా పనులా..?

- సిల్ట్ తొలగింపు కోసం ఇటీవలే టెండర్లు
- నగరపాలక సంస్థ అధికారుల తీరుపై విమర్శలు

**ఓ ప్రభుత్వ విభాగానికి చెందిన పనులను ఇతర విభాగాలు చేయవు. కానీ, నగరపాలక సంస్థ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. ఏకంగా తన పరిధిని దాటి ఎస్సారెస్పీ కాలువల్లో సిల్ట్ తొలగింపు కోసం ఇటీవల టెండర్లు పిలువడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించేందుకే ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్ కార్పొరేషన్, మే 24 : ఏ సంస్థలో అయినా తన పరిధిలోకి వచ్చే పనులు మాత్రమే చేస్తారు. కానీ, కరీంనగర్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. నగరపాలక పరిధిలోని రేకుర్తిలోని షేకాబీకాలనీ నుంచి గౌడకాలనీ వరకు ఉన్న ఎస్సారెస్పీ డీ94 కాలువలో సిల్ట్ తొలగింపు కోసం ₹5.80లక్షలతో రెండు పనులను అప్పగించేందుకు ఈ నెల 20న టెండర్లు నిర్వహించారు. అయితే ఎస్సారెస్పీ కాలువలో సిల్ట్‌ను బల్దియా ఎలా తొలగిస్తుందని పలువురు అధికారులే విమర్శిస్తున్నారు. తన పరిధిలోకి రాని పనులను ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కేవలం కాంట్రాక్టర్లు, అధికారులు బిల్లులను పంచుకునేందుకే ఈ పనులను చేర్చారన్న ఆరోపణలు చేస్తున్నారు. అలాగే నగరంలోని పలు కాలనీల్లో 500 మీటర్లు కూడా ఉండని మురుగు కాలువలో సిల్ట్ తొలగింపు కోసం ఏకంగా ₹4.85 లక్షలు పెట్టారు. కొన్ని ప్రాంతాల్లో ఇటీవలే నూతనంగా నిర్మించిన మురుగు కాలువల్లోనూ సిల్ట్ తొలగింపునకు పనులు పెట్టడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూతన కాలువల్లో కూడా సిల్ట్ పేరుకుపోవడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయినా ఎండకాలం అయిపోయి వానకాలం దగ్గర పడుతున్న తరుణంలో సిల్ట్ తొలగింపు పనులు చేయడం వెనుక అనేక అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. అక్రమాలకు అధికారులు తెరలేపారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మార్కెటింగ్ శాఖ ఉద్యోగులకు జీతాలేవి?

- మూడు నెలలుగా అందని సాలరీ
- పెన్షనర్లకూ పెండింగే
- అటకెక్కిన కాంగ్రెస్ ఒకటో తారీఖునే వేతనాల హామీ
- ఆవేదనలో ఉద్యోగులు



మెట్‌పల్లి, మే24: 'మేం అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు చెల్లిస్తామన్న కాంగ్రెస్ హామీ అటకెక్కింది. ఒకటో తేదీ కాదు కదా..! మూడు నెలలుగా జీతాలు అందని పరిస్థితి మార్కెటింగ్ శాఖలో నెలకొన్నది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులూ వేతనాల కోసం నెలల తరబడిగా వేచి చూస్తున్నారు. రోజు వారీ ఖర్చులు, ఇతరాత్ర అవసరాలకు సంబంధించి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరే కాదు ఈ శాఖలో పనిచేసి విరమణ పొందిన పలువురు పెన్షన్‌దారులదీ మూడు నెలలుగా ఇదే పరిస్థితి. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని, ఒకటో తేదీనే వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, పెన్షనర్లు కోరుతున్నారు.



పొలాసలో రైతులకు విత్తనాలు అందిస్తున్న ఏడీఆర్ డాక్టర్ జీ శ్రీనివాస్

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

- ఏడీఆర్ డాక్టర్ జీ శ్రీనివాస్
- పొలాస పరిశోధనా స్థానంలో 'విత్తన మేళా 2024'
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన రైతులు

జగిత్యాల టౌన్, మే 24 : నాణ్యమైన విత్తనాలు వాడితే అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు డాక్టర్ జీ శ్రీనివాస్ సూచించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసుకోవడంతోపాటు సరైన సమయంలో పంటలు సాగు చేస్తే చీడపీడల ఉధృతి తగ్గి పంట పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. దీంతోపాటు నాణ్యమైన అధిక దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. రైస్ బ్రీడర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా విత్తనానికి అయ్యే ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. రైతులు సాగు చేసిన వరిని విత్తనాలుగా ఇతర రైతులకు అమ్మడం వల్ల కూడా ఆదాయం పొందవచ్చని సూచించారు. అనంతరం పరిశోధనా స్థానం నుంచి విడుదలైన వివిధ రకాల విత్తనాలు, వాటి లక్షణాలు, వరి విత్తనోత్పత్తిలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం ఏడీఆర్ జీ శ్రీనివాస్ విత్తన మేళాను ప్రారంభించారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విత్తనాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ గోన్యానాయక్, ఇతర విభాగాల శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# రూ. 50 లక్షల అప్పు తిరిగివ్వడంలేదని..

- మనోవేదనతో ఒకరి బలవన్మరణం

జగిత్యాల కలెక్టరేట్, మే 24: అవసరానికి రూ. 50లక్షలు అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వకపోడంతో మనేవేదనతో ఒకరు తనువు చాలించాడు. సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ని కిటికికి చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. శుక్రవారం జరిగిన ఘటనతో జగిత్యాలలోని మిషన్ కాంపౌడ్ ఏరియాలో విషాదం నెలకొన్నది. జగిత్యాల పట్టణ ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌కు చెందిన కొయ్యని రతన్ రాయల్ (45), వైజాగ్‌కు చెందిన శ్రీనివాసమూర్తికి కొన్నేండ్ల క్రితం రూ. 50లక్షలు అప్పుగా ఇచ్చాడు. రతన్ కొంతకాలంగా అప్పు తిరిగివ్వమని శ్రీనివాస మూర్తిని అడుగుతున్నాడు. అయితే అతడు అప్పు తిరిగివ్వనని దురుసుగా చెప్పాడు. ఈ విషయాన్ని రతన్ పలుమార్లు భార్యకు చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురై సూసైడ్ నోట్ రాసి జేబులో పెట్టుకొని శుక్రవారం ఉదయం ఇంటి కిటికీకి చీరతో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

# దివ్యాంగులకు ఇంటర్‌లో ఉచిత ప్రవేశాలు



కరీంనగర్ కలెక్టరేట్, మే 24 : గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన దివ్యాంగులకు, ఇంటర్మీడియట్‌లో ఉచిత విద్యావకాశాలు కల్పిస్తున్నట్టు కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7.0 జీపీఏ, ఆపై ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌తోపాటు నీట్, ఎప్‌సెట్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు, ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీ చేశారని వెల్లడించారు. ఔత్సాహికులైన విద్యార్థులు ఈ నెల 30 లోగా ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన మొదటి విద్యార్థుల జాబితా వచ్చే నెల 3న విడుదల చేస్తారని వివరించారు. విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించిన తర్వాత రెండో విడుతలో ఎంపికైన విద్యార్థుల జాబితా వచ్చే నెల 6న ప్రకటిస్తారని చెప్పారు.

## నాడు - నేడు

పోయిన ఎండల్లో మత్తడి దుంకి..



కేసీఆర్ సర్కారు పాలనలో ఎక్కడ చూసినా జలం పుష్కలంగా కనిపించేంది. ఎత్తిపోతలతో మండుటెండల్లోనూ చెరువులు, కుంటలు కళకళలాడేవి. సరిగ్గా ఏడాది క్రితం అంటే మేలో కొత్తపల్లి చెరువు ఇలా మత్తడి దూకింది.

ఇప్పుడు అడుగంటి..



ఇప్పుడు అంతటా పరిస్థితి మారిపోయింది. ఎక్కడ చూసినా నీటి కటకట మొదలైంది. భూగర్భజలాలు అడుగంటాయి. చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. అందుకు నిదర్శనమే ఈ కొత్తపల్లి చెరువు.

- కరీంనగర్, ఫొటోగ్రాఫర్

# డిగ్రీకి క్రేజ్

## ఏటేటా పెరుగుతున్న ప్రవేశాలు

- కొనసాగుతున్న దోస్త్ రిజిస్ట్రేషన్లు
- మొదటి విడుత వెబ్ ఆప్షన్లకు 30వరకు గడువు

**కేసీఆర్ సర్కారు చేపట్టిన విద్యాసంస్కరణలతో డిగ్రీ విద్యకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ కొలువుల సాధనకు దగ్గరి దారి కావడం, ప్రైవేట్‌లోనూ ఉపాధి అవకాశాలు పెరుగుతుండడంతో డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కనిపిస్తున్నది. బీఏ, బీకాం, బీఎస్సీ లాంటి రెగ్యులర్, బీబీఏ, డిగ్రీ ఆనర్స్ వంటి కాంబినేషన్ కోర్సులు చదివేందుకు విద్యార్థులు మొగ్గుచూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో మొదటి విడుత ఆప్షన్‌కు ఈ నెల 30 వరకు గడువు ఉండగా 'దోస్త్'లో పెద్దసంఖ్యలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.**






కరీంనగర్ కమాన్ చౌరస్తా, మే 24: విద్యారంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో డిగ్రీ విద్యకు మంచి ఆదరణ లభిస్తున్నది. ఇంజినీరింగ్, మెడిసిన్ మోజులో పడి అటువైపు వెళ్లిన విద్యార్థులు ఇప్పుడు సాధారణ గ్రాడ్యేయేషన్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెటింగ్ పోకడలకు అనుగుణంగా శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని దాదాపు 80కి పైగా డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. ముఖ్యంగా కాంబినేషన్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఈ పరిస్థితుల్లో పెద్దసంఖ్యలో గ్రాడ్యుయేషన్ చేసేందుకు ఇష్ట పడుతున్నారు. ప్రస్తుతం డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం ఆఫ్ తెలంగాణ (దోస్త్) 2024 ద్వారా నమోదవుతున్న రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే ఈ విషయం తెలిసిపోతున్నది.

### పోటీ పరీక్షలు, పార్ట్‌టైమ్ జాబ్స్‌కు అనుకూలం

డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇటు పోటీ పరీక్షలు, అటు పార్ట్‌టైమ్ జాబ్స్ చేసుకొనే అవకాశం ఉంటుంది. దీంతో పేద, దిగువ మధ్య తరగతి విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరుతున్నారు. కరీంనగర్‌కు చుట్టుపక్కల ఉన్న ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లా కేంద్రానికి వచ్చే విద్యార్థులు నగరంలో డిగ్రీ కాలేజీల్లో చేరుతున్నారు. చదువుకుంటూనే ఇక్కడ స్విగ్గీ, జోమాటో, ర్యాపిడో వంటి ఉద్యోగాలు చేస్తున్నారు. పరిమిత కాలంతో హోటళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాళ్లల్లో పని చేస్తున్నారు.

### 29 వరకు మొదటి విడుత

డిగ్రీలో ప్రవేశాల కోసం ప్రభుత్వం దోస్త్‌లో మే 6వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అందులో మూడు ఫేజుల్లో సీట్లను భర్తీ చేస్తుండగా, మొదటి విడుత రిజిస్ట్రేషన్లకు మే 29 ఆఖరు కాగా, వెబ్ ఆప్షన్లకు మే 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. అందుకు శాతవాహన యూనివర్సిటీ పరిధిలో దోస్త్ హెల్‌లైన్ ఏర్పాటు చేశారు. అందులో కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సూరపల్లి సుజాత ఉండగా, టెక్నికల్ అసిస్టెంట్లు మార్క సంతోష్, గొల్లె మారుతి, సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రవీణ్ కొనసాగుతున్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి



శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. 80 కాలేజీల్లో రెగ్యులర్‌తోపాటు బీబీఏ, కంప్యూటర్స్, హోటల్ మేనేజ్‌మెంట్ లాంటి 25 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్ సందేహాలు ఉంటే యూనివర్సిటీలోని దోస్త్ హెల్ప్ సెంటర్‌లో ఆఫీసు వేళల్లో సంప్రదించాలి.

- ప్రొఫెసర్ సూరపల్లి సుజాత, దోస్త్ ఎస్‌యూ కోఆర్డినేటర్

# గుప్త నిధుల పేరిట ఎర

- మహిళను నమ్మించి ₹32 లక్షలు స్వాహా
- ఠాణా మెట్లెక్కిన బాధితురాలు
- పోలీసుల అదుపులో నిందితులు

వేములవాడ, మే 24 : భూమిని అమ్మగా పెద్దమొత్తంలో నగదు వచ్చిందని తెలుసుకున్న మోసగాళ్లు ఓ అమాయకురాలికి ఎర వేశారు. గుప్తనిధులు వెలికితీస్తామని మాయమాటలు చెప్పి ఆ మహిళ వద్ద నుంచి ₹32లక్షలు కాజేశారు. రెండు రోజుల క్రితం బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు శుక్రవారం ముగ్గురి సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లి చెందిన అంజవ్వ ఇటీవల తన తల్లిగారి ఊరైన కోనాయిపల్లిలో తన భూమి అమ్మగా పెద్దమొత్తంలో నగదు వచ్చిం ది. ఈ విషయం గ్రామంలోని ఒకరి ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న సదరు ముఠా ఆమె ఇంటికి వెళ్లింది. మీ ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని, వెలికితీస్తామని మాయమాటలు చెప్పి నమ్మించారు. మొత్తం ₹32లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను గుర్తించారు. వేములవాడ మండలంలో ఒకరిని, కోనరావుపేట మండలంలోని ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

# హుజూరాబాద్ ప్రైవేట్ దవాఖానలపై ఫోకస్

## రంగంలోకి టీఎస్‌ఎంసీ వైద్యబృందం

- చుక్కలతో కంటిపొర తొలగిస్తున్నట్టు వైరల్
- ప్రకృతి చికిత్సా కేంద్రంలో తనిఖీలు
- అనుమతులు లేవని ఆగ్రహం
- పలు ప్రైవేట్ క్లినిక్‌ల్లోనూ సోదాలు
- పర్మిషన్లు లేవని, క్వాలిఫైడ్ డాక్టర్లు లేరని గుర్తింపు
- చర్యలకు కోసం ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని వెల్లడి



హుజూరాబాద్‌లోని ప్రకృతి వైద్యాలయంలో తనిఖీలు చేస్తున్న టీఎస్‌ఎంసీ వైద్య బృందం సభ్యులు

హుజూరాబాద్, మే 24: హుజూరాబాద్‌లో టీఎస్‌ఎంసీ వైద్య బృందం రంగంలోకి దిగింది. శుక్రవారం ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించింది. అనుమతులు లేని దవాఖానలపై చర్యలకు సిఫారసు చేయడంతోపాటు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని వెల్లడించింది. అయితే, తనిఖీలతో పలు ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు హడలిపోయారు. అనుమతులు లేకపోవడంతో ముందుగానే క్లినిక్‌లకు తాళాలు వేసి తప్పించుకున్నారు. వివరాల ప్రకారం.. హుజూరాబాద్‌లోని ప్రకృతి చికిత్సాకేంద్రంలో 400 మంది రోగులకు కంటి చుక్కలు వేసి పొరలు తొలగిస్తున్నట్టు వీడియో సోషల్ మీడియాలో ఇటీవల వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసీ) సీరియస్‌గా తీసుకున్నది. చైర్మన్ మహేశ్‌కుమార్ ఆదేశాలతో డాక్టర్లు నరేశ్ కుమార్, రాజకుమార్ నేతృత్వంలో ఐదుగురు వైద్యుల బృందం రంగంలోకి దిగింది. శుక్రవారం ప్రకృతి చికిత్సా కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేసింది. నిర్వాహకుడు కలకోటి కిషన్‌రావును ప్రశ్నించింది. ఆయన ఆయుర్వేద వైద్య విద్య, నాచురోపతిలో ఓపెన్ డిగ్రీ చేసినట్టుగా సర్టిఫికెట్లు చూపించగా, ఆయుర్వేదిక్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ కానీ, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించింది. సదరు కంటి వైద్య శిబిరం మహర్షి గోశాలలో నిర్వహించినట్టు, ప్రతి నెలా అక్కడ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు కిషన్‌రావు తెలుపగా, ఇక నుంచి నిర్వహించవద్దని చెప్పింది. అలాగే వైద్యబృందం సభ్యులు హుజూరాబాద్ మార్కెట్ రోడ్‌లోని సంజీవని, శ్రీరామ, సూర్య పాలి క్లినిక్‌ల్లో కూడా తనిఖీ చేశారు. వీటికి జిల్లా అధికారుల నుంచి కూడా అనుమతులు లేవని, పదుల సంఖ్యలో బోర్డులపై డాక్టర్ల పేర్లు రాసిపెట్టి లోపల ఒక్క క్వాలిఫైడ్ వైద్యుడు కూడా ఉండడం లేదని, అటువంటి బోర్డ్స్ తొలగించాలని సూచించారు. అన్ని క్లినిక్స్‌లో ఇన్‌పేషెంట్స్ బెడ్స్ కూడా నిర్వహిస్తున్నారని గుర్తించి, అనుమతిలేని ఈ సెంటర్లను సీజ్ చేయాలని జిల్లా అధికారులకు సిఫారసు చేశారు. అలాగే, మొత్తం తనిఖీలకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని, చర్యలకు సిఫారసు చేస్తామని చెప్పారు. ఆకస్మిక తనిఖీల విషయం తెలుసుకున్న పలు ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు వణికిపోయారు. క్లినిక్‌లకు తాళాలు వేసి పారిపోయారు. తనిఖీ చేసిన వారిలో కరీంనగర్ జిల్లా ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్ రెడ్డి, హెచ్‌ఆర్‌డీఏ సెక్రెటరీ డాక్టర్ శరణ సాయి, డాక్టర్ పసుల గౌతం ఉన్నారు.



మల్లాపూర్ మండలం వాల్గొండ శివారులోని గోదావరిలో ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతూ..

# ఇసుక దోపిడీ

- మెట్‌పల్లి, మల్లాపూర్ పెద్దవాగు, గోదావరి నుంచి అర్ధరాత్రి అక్రమ రవాణా
- నిత్యం వందలాది ట్రాక్టర్లలో తరలింపు
- నెంబర్ ప్లేటులేని వాహనాలతో దందా

**ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు! నిబంధనలను కాలరాస్తూ ఇసుక దందాకు పాల్పడుతున్నారు. మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాల్లోని పెద్దవాగుతో పాటు గోదావరి నుంచి పగలంతా తోడి, చీకటి పడగానే పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు.. లైసెన్స్ లేని డ్రైవర్లతో తీసుకెళ్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.**

మెట్‌పల్లి, మే 24 : మెట్‌పల్లి పరిధిలో ఇసుక దందా జోరుగా సాగుతున్నది. మెట్‌పల్లి, మల్లాపూర్‌లోని పెద్దవాగు, గోదావరి నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో తరలిపోతున్నది. అసలే అక్రమ దందా, ఆ పై తమ ఇష్టారీతిగా ట్రాఫిక్ నిబంధనలను కాలరాస్తూ ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక తరలించే ట్రాక్టర్‌కు నెంబర్ ప్లేటు ఉండదు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ ఉండదు, వాహనం నడిపే డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ అసలే ఉండదు. ముందు, వెనుక నెంబర్ ప్లేట్లు ఉండవు. ఒక వేళ ఉన్నా అవి కనిపించకుండా సంఖ్యలను చెరిపేసి రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తున్నారు. సంబంధిత విభాగం అధికారులు సైతం పట్టుబడిన వాహనాలను జరిమానా విధించి వదిలేస్తున్నారే తప్ప, ఆ వాహనాలకు నెంబర్‌ప్లేటు, ఇన్సూరెన్స్, చోదకుడికి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నాయా, లేదా? అనే కోణంలో విచారించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే పట్టుబడ్డ ట్రాక్టర్‌కు జరిమాన విధించి కట్టించడం, ఆ వెంటనే విడుదల చేయడం, మళ్లీ యథేచ్ఛగా ఇసుక రవాణా చేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై జరిమానా విధించడంతో పాటు వాహనానికి సంబంధించి నెంబర్ ప్లేటు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను పరిశీలించి ఆ దిశగా కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మెట్‌పల్లి సీఐ నవీన్‌ను సంప్రదించగా.. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలించే వాహనాలను పట్టుకుంటున్నామని, నంబర్ ప్లేట్స్, ఇన్సూరెన్స్‌తోపాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వాహనాలను తదుపరి చర్యల కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తున్నామని చెప్పారు.